

పాత వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు 906666/ ఆర్/2017, ఈ ఏడాది ఫిబ్రవరి 21న ప్రకారం ఉపయోగంలో ఉన్న అన్ని పాత వాహనాలకు కూడా హెచ్ఎస్ఆర్పి నంబర్ ప్లేట్లు బిగించుకోవాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ తెలిపారు. వాహన యజమానులు దీనికోసం ఏర్పాటు చేసిన ఎస్ఐఎఎం (సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్) వెబ్‌సైట్‌లో తమ వాహనం నంబర్‌పై హెచ్ఎస్ఆర్పి నంబర్ ప్లేట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. నంబర్ ప్లేట్లు బిగించుకోకపోతే కేసులు నమోదు చేసి కాంపౌండింగ్ ఫీ వసూలు చేయటంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

ఎపి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచ్‌లు

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రామ పంచాయతీలకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులు దారి మళ్లించి, గ్రామాల అభివృద్ధిని నిర్వీర్యం చేసి, పంచాయతీ సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాల్లా మార్చిన వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో ఓటమి ఏంటో చూపిస్తామని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. సర్పంచ్‌ల న్యాయబద్ధమైన 16 డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి జిల్లాలోని సర్పంచులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. డిమాండ్లను పరిష్కరించాలంటూ.. సిఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వాటా నిధులు ఇవ్వకపోగా, స్థానిక ఆదాయ వనరుల ద్వారా వచ్చే సొంత నిధులను, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పంపిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వేలకోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం సొంత పథకాలకు దారి మళ్లించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గ్రామ సచివాలయ వాలంటరీలకు తాము వ్యతిరేకం కాదని, సర్పంచుల ఆధ్వర్యంలో వారు విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. మూడు కోట్ల, 60 లక్షల మంది గ్రామస్తుల సమ స్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం ముందుంచుతే ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. వైసిపి ప్రభుత్వం సర్పంచ్‌లకు చేసిన అన్యాయాన్ని టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ అన్ని పార్టీల నేతలకు తెలిపామని చెప్పారు. వైసిపి సర్పంచులు కూడా ఉద్యమానికి మద్దతు తెలిపి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు రెండు నెలల వ్యవధి ఉందని, నిధులు ఇస్తే మంచిదని విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు బదులిచ్చారు. జగన్‌ను ఇంటికి పంపితేనే పంచాయతీల్లోని గ్రామాలు అభివృద్ధి సాధ్య పడుతుందని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నా వైసిపి ప్రభు త్వానికి చీమకుట్టినట్లు లేకపోవడం దారుణం అన్నారు. గ్రామ వాలంటరీలను, గ్రామ సచివాల యాలను పంచాయతీల్లో విలీనం చేసి, సర్పంచుల ఆధ్వర్యంలో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సింగంశెట్టి సుబ్బరామయ్య, ఉమ్మడి కడప జిల్లా పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స్థలాలు ఇచ్చే వరకూ భూపోరాటం

ప్రజాశక్తి- గోపవరం


పేదలను ఉద్దేశించి మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శివకుమార్

బద్వేల్ మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చేవరకు భూపోరాటం కొనసాగుతుందని, పేదల ఇంటి స్థలాల కోసం బుధవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం బద్వేల్ మండలం సి.కొత్తపల్లి రెవెన్యూ పొలంలో కొనసాగుతున్న భూపోరాటాన్ని పరిశీలించారు. అనంతరం వారు పేదలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా పేదవాడు జానడు జాగా కోసం పోరాటం చేయాల్సి వస్తుందంటే ఇది పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శించారు. బద్వేల్ మండలంలో వందలాదిమంది ఇంటి స్థలం లేని పేదలు బాడుగ ఇండ్లలో జీవిస్తున్నారని వాపోయారు. పట్టణానికి సమీపంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ జగనన్న కాలనీల పేరుతో పేదలను ప్రభుత్వం పట్టణానికి దూరంగా తరమటం దుర్మార్గమని పేర్కొన్నారు. పేదలకు దక్కాల్సిన భూములను భూకబ్జా దారులకు కట్టబెట్టడం కోసమే ప్రభుత్వ అధికారులు కుమ్మక్కయ్యారని వారు ఆరోపించారు. మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసే వరకూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూనే ఉంటామని చెప్పారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రమణ, ఓబులేసు, రాంబాబు, రామసుబ్బమ్మ, దుర్గమ్మ పాల్గొన్నారు,

పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం సహకరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్


సమావేశంలో మాట్లాడుతున్న రాజోలు వీరారెడ్డి

ప్రపంచానికి, దేశానికి, రక్షణ రంగానికి ఎంతో అవసరమైన యురేనియం హానికరమని తెలిసి కూడా జిల్లా ప్రజలు త్యాగాలు చేసి అందిస్తున్నారని, ఇటువంటి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని ఆర్‌విఆర్ ఇబిసి ఫౌండేషన్ అధ్యక్షులు రాజోలు వీరారెడ్డి కోరారు. మంగళవారం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం జిల్లాపై ఎలాంటి శ్రద్ధ లేకుండా వివక్ష చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలో ఉన్న హామీలను కడప జిల్లా వరకైనా అమలు చేయాలని కోరారు. రాయితీలు ఇస్తే పరిశ్రమలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి వెంట కొన్ని పార్టీలు వెళుతున్న నేపథ్యంలో వారైనా ప్రధానమంత్రి, కేంద్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. జిఎస్‌టి, ట్యాక్స్ మినహాయింపులు, బ్యాంకు రుణాలు ఇస్తే పరిశ్రమలు అధికంగా వస్తాయని చెప్పారు. యువతకు ఉద్యోగాలు మెండుగా ఉంటాయని తెలిపారు. రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. రాయితీల విషయంపై అన్ని పార్టీల నాయకులకు తమ ఫౌండేషన్ తరపున వినతి పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో తేజ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండి జనార్ధన్ రెడ్డి, సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మనోజ్ కుమార్, పారిశ్రామికవేత్త ఈశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి

కడప : రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, నగర అధ్యక్షులు ప్రీతం రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం స్థానిక కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014లో ప్రత్యేక హోదా సహా విభజన హామీలన్నీ తూచా అమలు చేస్తామని బిజెపి చేతిలో చెయ్యేసి చెప్పిందని, అప్పుడు మోడీ, చంద్రబాబు, పవన్ ఉమ్మడి వేదికలపై సమిష్టిగా చేతులెత్తి అభివాదాలు చేసి మరి ఓట్లు అడిగారు అన్నారు. రాష్ట్రాన్ని బిజెపి అంధకారంలోకి నెట్టేసి పైగా బిజెపి, టిడిపి, జనసేన పొత్తు పెను చీకట్లు చీల్చడానికంటూ నీతులు చెబుతున్నారని వాపోయారు. రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా చేసిన బిజెపితో సాన్నిహిత్యం టిడిపి, జనసేనకు నష్టదాయకమే అన్నారు. రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా కోరారు. సమావేశంలో పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పిసిసి డెలిగేట్ పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

కడప : కడప కలెక్టరేట్‌లో కంప్యూటర్లు, లాప్టాప్‌లు, ప్రింటర్లు టీవీలు, స్కానర్లు కొనుగోలు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. కంప్యూటర్లు లాప్టాప్స్, స్కానర్లు ఈనెల 12వ నుంచి 15వ తేదీ మధ్యాహ్నం 2:00 గంటల వరకు కలెక్టరేట్ లోని సి-బ్లాక్‌లో పరిపాలనాధికారి కార్యాలయంలో దరఖాస్తుల అందుబాటులో ఉంటా యన్నారు. దరఖాస్తు కోసం రూ. 5000 జాయింట్ కలెక్టర్ పేరున డిడి చెల్లించి దరఖాస్తును స్వీకరించాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తును ఈనెల 15 న మధ్యాహ్నం 3:00 గంటల లోపు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4:00 గంటలకు టెండర్లు తెరవబడతాయని తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

యువజన సర్వీసుల (స్టెప్) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మాధవరంలోని హ్యాపీ కిడ్స్ హై స్కూల్, ఒంటిమిట్ట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'వ్యక్తిత్వ వికాసం' పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ మాట్లాడుతూ వ్యక్తిత్వం అనేది ఒక వ్యక్తి వాస్తవ పరిస్థితుల పట్ల ప్రదర్శించే ప్రవర్తన ద్వారా వక్తీకరిస్తుందని చెప్పారు. అదే చొరవ విజయానికి దారితీస్తుంది అన్నారు. రాబోయే పరిస్థితులను అంచనా వేసి ఎవరు చెప్పకుండానే ఏదైనా ప్రారంభించగల సామర్థ్యాన్ని ప్రోయాక్టివ్ అంటారని తెలిపారు. ఆధునిక విద్యావిధానం మనల్ని సమాజానికి అనుగుణంగా తీర్చి దిద్దడానికి శిక్షణ ఇస్తుందని అన్నారు. ఒక దేశం భవిష్యత్తు తరగతి గదిలో రూపొందుతాయని, వ్యక్తిత్వ వికాసంలో, సామాజిక అభివృద్ధిలో విద్య పాత్ర మహోన్నతమైందని చెప్పారు. కార్యక్రమంలో ఇరు పాఠశాలల విద్యార్థులు దాదాపు 200 మందితో పాటు మాధవరం, హ్యాపీ కిడ్స్ హై స్కూల్, ప్రధానోపాధ్యాయులు, శ్రీరాములు, ఒంటిమిట్ట, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయులు, వెంకట లక్ష్మి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కడప : జిల్లా వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ 13వ వసంతాలు పూర్తిచేసుకుని 14వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను పార్టీ జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా ఆవిష్కరించారు. తొలుత వైయస్ రాజ శేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నగర అధ్యక్షులు నారపరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలోఆవిర్భావ దినోత్సవ వేడుకలలో రాష్ట్ర- జిల్లా, నగర నాయకులు, మహిళా నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, కో ఆప్షన్ మెంబర్స్, జిల్లా, నగర అనుబంధ విభాగా అధ్యక్షులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-చెన్నూరు

మహిళలు అన్ని రంగాలలో ఆరికాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి మహిళలకు అన్ని రంగాలలో పెద్దపీట వేశారని చెప్పారు. మంగళవారం సాయంత్రం స్థానిక పంచాయితీ కార్యాలయంలో నాలుగో విడత చేయూత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పటునందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు అన్ని రకాలుగా చేయూతను ఇస్తున్నారని చెప్పారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మనమందరం తోడుగా నిలబడి వై.ఎస్. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. చేయూత పథకం ద్వారా 1761 మంది అక్కా చెల్లెమ్మలకు మ ంజూరైన 3. 30 కోట్ల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ అధ్యక్షులు పులి సునీల్ కుమార్, ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్ భాస్కర్ రెడ్డి, ఆర్‌విఎస్ఆర్, గణేష్ రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అల్లి శ్రీరామ మూర్తి, గుమ్మల్ల మధుసూదన్ రెడ్డి, ఆర్ఎస్ఆర్, సర్పంచ్‌లు సిద్ది గారి వెంకటసుబ్బయ్య, తుంగ చంద్ర శేఖర్ యాదవ్, భాగ్యమ్మ, నిరంజన్ రెడ్డి, శ్రీనివాసరాజు, ద్వారకనాథరెడ్డి, గొర్ల పుల్లయ్య గారి శివారెడ్డి, ప్రదీప్ రెడ్డి, రవి రెడ్డి, ఎపిఎం గంగాధర్, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యంశర్మ, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక కడప


శ్మశాన వాటికను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

మత సామరస్యానికి ప్రతీక కడప నగరమని ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ .బి అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ ఎం. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశాన వాటికలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కడప పెద్ద దర్గా, దేవుని కడప, మరియాపురం చర్చిలు కడప నగరానికి మాన్యుమెంట్స్ లాంటివని అన్నారు. ఇలాంటి మతసామరస్యం ఎక్కడా లేదని అన్నారు. మూడు శ్మశానవాటికలు ఒకే చోట ఉండడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. రూ. 6 కోట్లతో మోడల్ శ్మశాన వాటికను నిర్మించామని చెప్పారు. గతంలో కీ.శే. ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి స్థలాన్ని కేటాయించారని చెప్పారు. ఈ స్థలం చాలా గుంతలు గుంతలుగా ఉండేదని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంతో ఖర్చు చేసి శ్మశాన వాటికను ఒక మోడల్‌గా తీర్చిదిద్దామని చెప్పారు. హిందువల కోసం ఎక్కడలేని విధంగా క్రిమిటోరియ ను ఏర్పాటు చేశామని చెప్పారు. నగర మేయర్ మాట్లాడుతూ ఇంత అభివృద్ధి ఏ ప్రభుత్వంలో చూడలేదని చెప్పారు. కడప నగరం మతసామరస్యానికి ప్రతీకగా హిందూ ముస్లిం క్రైస్తవ మోడల్ శ్మవాన వాటికలని అన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందని ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని అన్నారు. తొలుత అతిథులుహిందూ ముస్లిం క్రైస్తవ మోడల్ శ్మశాన వాటికల శిలాఫలకాలను ఆవిష్కరించి, ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో హిందూ ముస్లిం క్రైస్తవ మత పెద్దలు, మున్సిపల్ అధికారులు సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి : డివైఎఫ్ఐ


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి. శివకుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రయివేట్ టీచర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు అవ్వగానే అసెంబ్లీ సమావేశాలలో ప్రయివేట్ టీచర్లకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని చెప్పారు. పిఎఫ్, ఇఎస్ఐ, కనీస వేతనం, సెలవులు వంటి వాటిపై ప్రయివేట్ విద్యాసంస్థలలో అమలు అయ్యేలా చేస్తామని చెప్పి హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపుకు ప్రయివేట్ టీచర్లు కీలక భూమిక పోషించారని తెలిపారు. కానీ వారి న్యాయమైన కోర్కెలు తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని వాపోయారు. మళ్ళీ ఎన్నికలు వస్తున్నాయని జిల్లాలో జిల్లా వ్యాప్తంగా ఆదివారం భారీగా వందలాది మంది టీచర్లను కడపకు తరలించి బూటకపు హామీలు ఇస్తున్నారన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రయివేట్ టీచర్ల సమస్యలపై ఒక్కసారైనా మాట్లాడారా, కనీసం పోరాడారా అని ప్రశ్నించారు. .ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి ప్రయివేట్ టీచర్ల వేదన, ఆక్రందన గమనించి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర అధ్యక్షులు షేక్. షాకీర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ప్రజాశక్తి-చెన్నూరు



మాట్లాడుతు్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య

రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రోత్సాహకమైన పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎ. వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం రెండో రోజు రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపాలని, ప్రకృతి వ్యవసాయం అనాదిగా చేస్తున్న వ్యవసాయమని పేర్కొన్నారు. కొందరు రైతులు ఎక్కువ రసాయనిక పద్ధతులపై ఆధారపడి సాగు చేస్తున్నారని, దీని వల్ల పంట ఖర్చు పెరగడంతోపాటు వాతావరణ సమతుల్యం దెబ్బతిం టుందని పేర్కొన్నారు. రైతులు వీలైనంత ప్రకృతి వ్యవసాయ యాజమాన్య పద్ధతులను పాటించి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని తెలియజేశారు. సస్యరక్షణ శాస్త్రవేత్త ప్రకృతి డాక్టర్ వి.శిల్పకళ వ్యవసాయంలో ఉపయోగించే ద్రావణాలు, కషాయాల తయారీ విధానం, వాటి ఉపయోగాలు గురించి వివరించారు. అలాగే ప్రకృతి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలు, ఆర్గానిక్ సర్టిఫికేషన్ విధివిధానాలు గురించి తెలియజేశారు. అనంతరం మండలంలోని బలసింగాయపల్లి గ్రామానికి చెందిన బాలాజీ అనే రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన నువ్వుల పంటను సందర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ మానస, డాక్టర్ కే .సాయి మహేశ్వరి, ఆర్‌బికె సిబ్బంది, ఎపిసిఎంఆఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


కమలాపురం పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు

ప్రజాశక్తి-కమలాపురం

అనవసర సమస్యల్లో ఇరుకున్ని భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ హృషికేశవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కమలాపురం మూడు రోడ్ల కూడలి నుంచి గ్రామ చావిడి వరకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కమలాపురం నియోజకవర్గంలోని అన్ని సమస్య ఆత్మక గ్రామాలు, ఫ్యాక్షన్ గ్రామాల్లో కూడా ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు సిఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండట్ విజయ్ కుమార్, కేంద్ర బలగాలు, కమలాపురం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శంకవరంలో ఇంటింటి ప్రచారం

కలసపాడు : మండలంలోని వైసిపి నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఇన్‌ఛార్జి, జడ్‌పిటిసి అంకనగురివిరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిమ్ మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ వైసిపి తరుపున పోటీ చేసే బద్వేల్ శాసనసభ సభ్యురాలు డాక్టర్ సుధాకు ఓటు వేసి అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బోయిన నిర్మల నారాయణ, మాజీ ఎంపిపి సుధా రామకృష్ణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, జెఎసి మండల కన్వీనర్ చిత్తా రాజశేఖర్ రెడ్డి, మండల వైసిపి అధ్యక్షుడు సగిలి సుదర్శన్, ఎంపిటిసి సగిలి రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎఎ అమలుపై తొత్తు పార్టీలు సమాధానం చెప్పాలి

ప్రజాశక్తి - కడప

కేంద్రంలోని మతోన్మాద భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న అత్యంత ప్రమాదకరమైన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలుపై తొత్తు పార్టీలు, పొత్తు పార్టీలు రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలకు, ప్రజలకు సమాధానం చెప్పాలని ఎపి కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత విద్వేషం, ముస్లిముల నిర్మూలన అజెండాగా పరిపాలిస్తున్న బిజెపితో అపవిత్ర కలయిక కొన సాగిస్తున్న అధికార వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు సిఎఎ అమలుపై ప్రధానంగా ముస్లిం మైనార్టీలకు సమాధానం చెప్పాలని కోరారు. కేవలం మతప్రాతిపదికన బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్ తదితర దేశాల్లోని మైనార్టీలుగా ఉన్న హిందువులు, సిక్కులు, జైనులు ,బౌద్ధులకు మాత్రమే ఎలాంటి షరతులు లేకుండా భారతదేశ పౌరసత్వం ఇచ్చేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. ముస్లిం మైనార్టీలను మాత్రమే పక్కనబెట్టి , అన్ని మతాలను నెత్తిన పెట్టుకున్న మత విద్వేష పూరిత బిజెపి ప్రభుత్వంతో మైత్రి బంధం కొన సాగిస్తున్న తెలుగుదేశం, వైసీపీ, జనసేన పార్టీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైనార్టీలను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికే భారత రాజ్యాంగ వ్యతిరేకమైన పౌరసత్వ నల్ల చట్టాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించి నట్లు తెలిపారు. సమావేశంలో పిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఒబిసి చైర్మన్ చిన్న కులాయప్ప, మాజీ కార్పొరేటర్ రహమతుల్లా ఖాన్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ, బిసి నగర అధ్యక్షుడు వేణు గోపాల్, సభ్యుడు సూర్యుడు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్

నేడు ఆత్మీయ అభినందన సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి. శివారెడ్డి, సిహెచ్ పురుషోత్తమ నాయుడు ఆత్మీయ అభినందన సభ విజయవంతం చేయాలని ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. మంగళవారం జడ్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న నిర్వహించే ఉమ్మడి జిల్లా, తాలూకా ఆఫీస్ బేరర్స్, సిటీ ఆఫీస్ బేరర్స్ అండ్ ఉమెన్ వింగ్ జిల్లా, సిటీ ఆఫీస్ బేరర్స్, జిల్లా లోని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్స్, జెఎసి అధ్యక్ష, కార్యదర్శులు, అవుట్సోర్సింగ్ అండ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్, ఉద్యోగ మిత్రులు హాజరుకావాలని చెప్పారు. ఉదయం ఇరిగేషన్ కాంపౌండ్ నుంచి ర్యాలీగా బయలుదేరి, కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, రైతు బజారు మీదుగా జడ్‌పి మీటింగ్ హాలుకు చేరుకుని మీటింగ్ హాలు లో సన్మాన సభ ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎన్‌జిఒ సంఘం జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, పంచాయతీ రాజ్ మినిస్ట్రీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. నాగిరెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహరీ
బుధవారం (సా)	గురువారం (ఉ)
6.30	5.09

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆకతాయిలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మైదుకూరు రోడ్డులోని శ్రీకెళ్లి వెంకటసుబ్బయ్య పాఠశాల బోర్డును పరిశీలించారు. కొందరు ఆకతాయిలు పాఠశాల సమయం ముగిసిన తరువాత విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లకుండా గేటుకు తాళం వేసి వెళ్లారన్నారు. విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లకుండా అసభ్య పదజాలంతో విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. వెంటనే ఆకతాయిలపై కేసు నమోదు చేసి పాఠశాల గేటు తాళం తెరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు.

పేదల అభ్యున్నతే సిఎం లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పేద ప్రజల అభ్యున్నతి కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్నపూస రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలని సిఎం వైఎస్ జగన్ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వమే ఆధునిక వైద్యం గ్రామీణ ప్రజల చెంతకు తీసుకొచ్చిందన్నారు. అనంతరం ఆధునిక వైద్యం కోసం అనుమతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సల్మాన్‌రాజు, ఎంపిటిసి జాఫర్, పంచాయతీ సెక్రటరీ హరికిషోర్, వైద్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎస్ఆర్ఐటి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రాజారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం చెన్నైకి చెందిన వర్క్ కహల్ కంపెనీ వారు నిర్వహించిన జాబ్‌మేళాలో కళాశాలకు చెందిన 5 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఆర్ రిక్రూటర్ ఉద్యోగాలకు అన్ని బ్రాంచిల బిటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు, ఎంబిఏ విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఎం.ఆయుష, జి సుస్మిత, బి వినయ, ప్రతీక్, వి కౌసల్య, కెవిలేష్ కృష్ణ చైతన్య ఎంపికైనట్లు తెలిపారు. వీరికి సంవత్సరానికి రూ.2.04 లక్షల ప్యాకేజీ అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్ఒడిలు అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రం వీరాంజనేయ స్వామి ఆలయానికి విచ్చేసే భక్తులకు నిత్యాన్నదాన పథకానికి అనంతపురం మారుతీనగర్ వాస్తవ్యులు కడపల్లె శేషు, ఆయన ధర్మపత్ని శ్రీ కుటుంబసభ్యులు రూ.1,01,116 విరాళం ఆలయ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డికి అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు.

ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలి

ప్రజాశక్తి - చాపాడు

గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన పథకాలను గుర్తుచేయాలని ఎంపిపి బి. లక్ష్మయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అన్నవరం, మడూరులో జెసిఎస్ సమావేశం నిర్వహించి సిద్ధం పేరుతో ముద్రించిన కర పత్రాలు, స్టిక్కర్లను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచులు వీరయ్య, మునీంద్ర, ఎంపిటిసి సీమోన్, వైసిపి నాయకులు ప్రసాద్‌రెడ్డి, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో తృప్తినిస్తుంది

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, రోగులకు దాదాపు 150 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. చాపాడు మండలం అల్లాడుపల్లె గ్రామానికి చెందిన ఐంద్రప్రస్థ దేవలపర్ల అధినేత పెరుగు నారాయణ యాదవ్ ఆర్థిక సహాయంతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాత పెరుగు నారాయణ యాదవ్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదన్నారు. అందులోనూ గర్భిణులు, రోగులకు అన్నదానం చేయడం చాలా గొప్ప కార్యక్రమన్నారు. కార్యక్రమంలో పెరుగు నారాయణ యాదవ్, వెంకట సుబ్బారెడ్డి, గుత్తి వీర కిషోర్ యాదవ్, ఇమ్మడిశెట్టి సతీష్ బాబు, సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు అన్నదానం చేస్తున్న నారాయణ యాదవ్

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీలోని 9వ వార్డు బాలాజీ నగర్‌లో సిసి రోడ్డు నిర్మాణానికి మంగళవారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్డును రూ.6 లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చంద్ర పేర్కొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని హెచ్ఎం విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి ఫలితాలు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

ప్రజాశక్తి - చెన్నూరు

మండలంలోని శివాల్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు వల్లూరు కిరణ్ కుమార్(22) ఇంటికి పోతూ ఆ గ్రామం దగ్గర బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి కడప రిమ్స్‌కు తరలించగా.. మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు. చెన్నూరు సిఐ పార్థసారథి సంఘటన స్థలాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అంకాలమ్మ గుడిలో చోరీ

రూ.4 లక్షలు విలువచేసే వెండి వస్తువులు అపహరణ

ప్రజాశక్తి - బి.కోడూరు

మండలంలోని మున్నెల్లి రాజుపాలెం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ పల్నాటి అంకాలమ్మ తల్లి దేవాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు అంకాలమ్మ దేవతను పూజించి రూ.4లక్షల విలువ చేసే వెండి వస్తువులను తీసుకెళ్లారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై బి కోడూరు ఎస్ఐ, సిబ్బంది, బి.కోడూరు మండల రెవెన్యూ సిబ్బంది, మున్నెల్లి విఆర్ఓ గురవయ్య గ్రామస్తులను విచారించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. త్వరలో దొంగల్ని గుర్తించి వస్తువులను తిరిగి రప్పించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

వేసవిలో హాయినిస్తున్న పచ్చదనం..

ప్రజాశక్తి - చాపాడు

ప్రస్తుతం వేసవి ప్రారంభం కావడంతో ఎండలు మండి పోతున్నాయి. ఎండకు వెళుతున్న వారు రోడ్డు పక్కన చెట్టు కనపడితే.. దాని నీడన కాసేపు నిలబడి సేదదీరితే హాయిగా ఉంటుందని ప్రతి ఒక్కరూ భావిస్తారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె దేవాలయాలకు వెళ్లేమార్గంలో మర్రిచెట్టు ఏపుగా పెరిగింది. మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై బస్సు దిగిన ప్రయాణికులు అల్లాడుపల్లెకు నడిచి వెళుతూ మర్రిచెట్టు నీడ కింద సేదదీరుతున్నారు. వివిధ వ్యాపారాల నిమిత్తం ద్విచక్ర వాహనాలు, ఆటోలలో ప్రయాణించి సేదదీరేందుకు చెట్టు కింద నిలబడుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో బస్సు షెల్టర్ కూడా అందుబాటులో లేకపోవడంతో చెట్టు నీడనే దిక్కుగా ఉంది. ఈ చెట్టు కింద ఏమాత్రం ఎండ పడకుండా చెట్టు నిండుగా ఉంది. హమ్మయ్య అంటూ ప్రయాణికులు చెట్టు కింద ఎంతో హాయిగా ఉందో అనుకుంటున్నారు. మరి కొందరు ఈ చెట్టు నీడన ఉన్న అరుగుపై నిద్రిస్తూ వేసవిలో కాలక్షేపం పొందుతున్నారు.



అల్లాడుపల్లె మార్గంలో చల్లదనాన్ని అందిస్తున్న మర్రిచెట్టు

టికెట్‌పై బాబు, లోకేష్ గట్టి నిర్ణయం తీసుకోవాలి

టికెట్ ఇవ్వండి.. ఎమ్మెల్యే పదవిని కానుకగా ఇస్తా, నాన్నలా త్యాగం చేయలేను : భూపేష్‌రెడ్డి



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి



ఆత్మీయ సమావేశానికి హాజరైన కార్యకర్తలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

టిడిపి జమ్మలమడుగు అసెంబ్లీ టికెట్‌పై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేష్ బాబు గట్టి నిర్ణయం తీసుకోవాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వారినుద్దేశించి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ.. 2021 నవంబర్ 26న తాను జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి పార్టీ చెప్పిన ప్రతి కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో చేశానన్నారు. 2024 ఎన్నికల్లో జమ్మలమడుగులో టిడిపి జెండాను ఎగురవేయాలనే సంకల్పంతోనే పనిచేశానన్నారు. టిడిపి అంటే గుండ్లకుంట కుటుంబం అనే పరిస్థితి ఉండేదని, ఆ కుటుంబం పార్టీని వదిలాక పార్టీ జెండాను భుజాన వేసుకొని 1983 నుండి టిడిపికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరిని కలుపుకొని నేడు ఈ స్థాయికి తీసుకొచ్చానని తెలిపారు. పార్టీని ఈ స్థాయికి 30 నెలల్లో తీసుకు రావడంలో తనకు సహకరించిన చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పార్టీ జనసేన, బిజెపితో పొత్తు పెట్టుకున్నప్పటికీ జమ్మలమడుగు టికెట్‌ను చేజార్చుకోవద్దని కోరారు. టికెట్ ఇవ్వండి జమ్మలమడుగు ఎమ్మెల్యే పదవిని కానుకగా ఇస్తానని భూపేష్‌రెడ్డి తెలిపారు. ఒకానొక సమయంలో భూపేష్‌రెడ్డి కన్నీటితో టికెట్ విషయంలో తనకు పొరపాటు చేయవద్దని మనవి చేశారు. దేవగుడి కుటుంబానికి రాజకీయాలు కొత్త కాదన్నారు. తాము వైసిపిలో ఉన్నా, టిడిపిలో ఉన్నా జమ్మలమడుగు అభివృద్ధినే కాంక్షించే పని చేస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మా నాన్న నారాయణరెడ్డి మాదిరి త్యాగం చేసే పరిస్థితిలో లేనని కార్యకర్తలకు తెలిపారు. ముఖ్యంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై భూపేష్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డి మార్కు కనపడలేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మాట్లాడుతూ టిడిపి పొత్తుల్లో ఇబ్బందులు ఏమీ ఉండవని ఆశిస్తున్నానని తెలిపారు. భూపేష్‌రెడ్డి నిర్ణయమే తన నిర్ణయమన్నారు. కార్యక్రమంలో దేవగుడి సోదరులు చదిపిరాల వేణు గోపాల్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, శివ నారాయణ రెడ్డి, జయరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి పాల్గొనడం గమనార్హం. అంతకుముందు దేవగుడి యూత్ నాగేశ్వర్‌రెడ్డి, జంబాపురం రమణారెడ్డి, జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున భూపేష్‌రెడ్డిని బలపరుస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో 13వందల నుంచి 15వందల మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడా నిధులతో జూనియర్ కళాశాల ఏర్పాటు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండల కేంద్రంలో రూ.3 కోట్లతో జూనియర్ కళాశాల, ఒక రూ.కోటితో నిర్మించిన అగ్రికల్చర్ గోడైన్‌ను సోమవారం వైసిపి మండల ఇన్‌ఛార్జి వైఎస్ కొండారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పార్టీలు, కులాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారని తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల వారు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకొనుటకు ఇబ్బందుల్లేకుండా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలో పాడా నిధులతో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. రైతులకు ఉపయోగపడేలా గోడౌన్‌ను నిర్మించారని తెలిపారు. చక్రాయపేట పులివెందుల నియోజకవర్గంలో విలీనం కావడం మండల వాసులు చాలా అదృష్టవంతులన్నారు. కార్యక్రమంలో ఇందుకూరి లీలావతి, చక్రాయపేట సర్పంచ్ హర్షద్ ఆయుబ్ బాషా, మండల కో-ఆప్షన్ మెంబర గౌస్‌లాజం, ఎల్ఎం రామాంజనేయరెడ్డి, జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి, జూనియర్ కళాశాల కాంట్రాక్టర్, అగ్రికల్చర్ గోడెన్ కాంట్రాక్టర్లు రాసినేని మధు, ఓబుల్ సుబ్బారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్న వైఎస్ కొండారెడ్డి

ఎర్రగుంట్లలో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని ప్రధాన వీధులు, రహదారుల గుండా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు సిఐ ఈశ్వరయ్య కేంద్ర బలగాలతో మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కూడా ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేలా కేంద్ర బలగాల సహకారంతో కవాతు నిర్వహిస్తున్నామని సిఐ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, కేంద్ర బలగాలు ఉన్నారనే ధైర్యం ప్రజల్లో కల్పించేందుకే కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వివాదాస్పదమైన, వివక్ష పూరిత పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని, వెంటనే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పౌరసత్వ సవరణ చట్టం భారత రాజ్యాంగానికి, లౌకికవాదానికి ముస్లిం సమాజానికి వ్యతిరేకమన్నారు. 2019 డిసెంబర్‌లో మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశ పెట్టినప్పటికి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందని చెప్పారు. జెడివి లాంటి కొన్ని బిజెపి మిత్రపక్ష పార్టీలు కూడా పార్లమెంటులో ఈ బిల్లును వ్యతిరేకించినట్లు చెప్పారు. దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి సభ్యులు పార్లమెంటులో మద్దతు తెలిపారని అన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. పులివెందుల రాష్ట్రానికి ఆదర్శమని సిఎం జగన్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఏమిట్లో ఆదర్శమో సిఎం ప్రజలకు చెప్పాలని తులసిరెడ్డి ప్రశ్నించారు.

మెడికల్ కాలేజీకి కేంద్రం అనుమతి ఉందా?

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలోని డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అనుమతులు లేవని, అలాంటప్పుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎలా ప్రారంభిస్తారని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) ప్రశ్నించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాలేజీ, ఆసుపత్రి, ఇతర కార్యాలయాలు, భవన నిర్మాణాలు పూర్తి కాకుండానే ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రారంభించారని అన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తూనే ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులు మెడికల్ కళాశాలకు ఉన్నాయని, కనీసం పులివెందులలో ఉండే వైసిపి వారితోనైనా విలేకరుల సమావేశంలో అనుమతి పత్రాలను చూపించాలని ఆయన కోరారు. 175కు175సీట్లు గెలుస్తామని చెప్పే ముఖ్యమంత్రి మళ్లీ గెలిచి మెడికల్ కళాశాలను పూర్తి చేసి అనుమతులు వచ్చాక ప్రారంభించవచ్చు కదా అని ప్రశ్నించారు. జరగబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని స్పష్టంగా గ్రహించి పేరు ప్రఖ్యాతల కోసం తమ ప్రభుత్వంలో పనులు పూర్తిగా చేశామని చెప్పుకునేందుకు మెడికల్ కాలేజీని, సెంట్రల్ బోలేవార్డు, ఇతర వాటిని ప్రారంభించారని రవి విమర్శించారు. తనను ఒంటరిని చేసి ఓడించాలని చూస్తున్నారని, అది వారి వల్ల కాదన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, నల్లగారి భాస్కర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఏసు, మునయ్య పాల్గొన్నారు.

అవగాహన లేకుండా మాట్లాడడం సమంజసం కాదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. అభివృద్ధి ఎక్కడా జరగలేదని, అంతా అవాస్తవం అన్నట్లు మాట్లాడడం సమంజసం కాదన్నారు. అభివృద్ధి జరిగిందా లేదా అనే విషయానికి మా వద్దకు వస్తే చూపిస్తామన్నారు. ఎక్కడైనా అవినీతి జరిగిందని మీ దగ్గర సాక్షాలు ఉంటే చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గత తెలుగు దేశం ప్రభుత్వంలో మీ సొంత గ్రామానికి ఏమి చేశారో చెప్పాలన్నారు. ఇప్పుడు మేము వైయస్సార్ జలకళ అనే స్కీం కింద రైతులకు మేలు చేస్తుంటే ఎందుకు మీకు అంత బాధని సూటిగా ప్రశ్నించారు. మీ ప్రభుత్వంలో నీరు-చెట్టు ద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయలేదా, దీనిపై మీరు రిటైర్డ్ జడ్జితో విచారణకు సిద్ధమేనా అన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు సంబంధించి మాట్లాడుతూ అయ్యా.. రవి అక్కడ ప్రారంభమైంది కేవలం ఆస్పత్రి, నర్సింగ్ కాలేజి మాత్రమే అన్నారు. మెడికల్ కళాశాల ఇంకా ప్రారంభం కాలేదన్నారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రారంభమవుతుందని తెలిపారు. దానికి సంబంధించి ఇండియన్ మెడికల్ కౌన్సిలింగ్ వారికి దరఖాస్తు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, గృహ సారథుల కమిటీ చైర్మన్ చంద్ర మౌళి, బలిజ సంఘం నాయకుడు గూడూరు ప్రసాద్, వైసిపి నాయకులు పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, సోపాల వీర సంపత్, డేనియల్, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీల ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక 21వ వార్డులో మాజీ కౌన్సిలర్ కాకి తిరుపతమ్మ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో 100 కుటుంబాలు మంగళవారం టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రం వెనుకబడి పోయిందన్నారు. ఈసారి ఎలాగైనా చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకొని ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు జేబీవుల్లా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి, రూరల్ మండలం కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, లక్ష్మీదేవి, శూలం లక్ష్మీదేవి, శూలం శివప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లేపాక్షి కళాశాలలో వైద్యశిబిరం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రూరల్ పరిధిలోని గోపవరం పంచాయతీ కాల్వకట్ట వీధిలో లేపాక్షి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, ఒత్తిడి లేని జీవితం, రెగ్యులర్ ఎక్సర్సైజ్, ప్రశాంతమైన నిద్ర, మనసుకి నచ్చిన పని ఇవన్నీ ఆరోగ్యంగా ఉండడానికి దోహద పడు తాయన్నారు. డాక్టర్ హనీఫ్ బాబా దాదాపు 300 మంది రోగులను పరీక్షించి, వైద్య సూచనలు, మందులు ఇచ్చారు. హెల్త్ సూపర్వైజర్ వరప్రసాద్, కళా శాల ఎన్ఎస్ ఎస్ ఈవో నాగభూషణ శర్మ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ఆరోపణల ముందు వాస్తవాలు గ్రహించాలి

ప్రొద్దుటూరు : రాజకీయ ప్రత్యర్థిపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు గ్రహించాలని, అలాంటి తప్పులు చేయని వ్యక్తి మాత్రమే ఆరోపణలు చేస్తే సమంజసంగా ఉంటుందని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శివారెడ్డి అను వ్యక్తి బోరు పాయింట్ వద్ద పనిచేస్తున్నాడని సోషల్ మీడియాలో ఉన్న ఉత్సాహంతో అక్కడ విధులు లేని సమయంలో పనిచేస్తున్నారన్నారు. ప్రభావతి భర్త రవి వీరు బదిలీ విధానం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో మున్సిపల్ పార్కులో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. సిఎఫ్ఎంఎస్ ద్వారా రెండు ఉద్యోగాలు చేయలేరని బ్యాంకు స్టేట్ మెంట్‌లను సమావేశంలో ప్రదర్శించారు. సంపత్ అను ఔట్‌సోర్సింగ్ కార్మికునికి బొల్లివ్యాధి సోకడంతో బదిలీ విధానంతో పనిచేస్తున్నాడన్నారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వద్ద డ్రైవర్‌గా విధులు నిర్వహించే సుబ్బరాయుడు కామిశెట్టి ఎయిడెడ్ కళాశాలలో తోటమాలిగా పనిచేస్తున్నాడని ఇదే కళాశాలలో అటెండర్‌గా ఉన్న శంకరాపురం రాము వరదరాజులరెడ్డి తనయుడు కొండారెడ్డి వద్ద అటెండర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. యోగివేమన ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే రసూల్ వరద వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడని ఇవి అక్రమాలు కావా అని బంగారెడ్డి ప్రశ్నించారు.

గ్రేడ్-1 మున్సిపాలిటీగా పులివెందుల

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం అయిన పులివెం దుల మున్సిపాలిటీని గ్రేడ్ వన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ సోమ వారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కార్యాలయం జిఒఎం ఎస్ నెంబర్ 45ను జారీ చేసింది. మున్సిపాలిటీలోని వైసిపి నాయ కులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో కోరినట్లు సమా చారం, వారి కోరిక మేరకు వెంటనే స్పందించి ప్రభుత్వం నుంచి జిఒను విడుదల చేసినట్లు తెలుస్తోంది.



పులివెందుల మున్సిపల్ కార్యాలయం

సిఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పులివెందుల మున్సిపాలిటీని గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 గా మార్చినందుకు మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కిసాన్ మజ్దూర్ బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మైదుకూరు

ఈనెల 14న న్యూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరుగు కిసాన్ మజ్దూర్ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వైయస్సార్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం మైదుకూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఢిల్లీ నగరాన్ని నాలుగు వైపుల చుట్టుముట్టి సంవత్సరకాలం పైబడి పోరాటం కొనసాగించారన్నారు. 700 మందికిపైగా రైతులు ఈ పోరాటంలో ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు. ఈ పోరాట పటిమకు దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి పోరాటాన్ని విరమింపజేశారన్నారు. ఇప్పటివరకు అధికారికంగా మూడు నల్ల చట్టాలను రద్దు చేయకపోవడం దుర్మార్గమన్నారు. మూడు నల్ల చట్టాలను రద్దు చేయడంతో పాటు కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని, వ్యవసాయ పరిరక్షణకు నాటి యూపీఏ ప్రభుత్వం వామపక్షాల ఒత్తిడితో వేసిన స్వామినాథన్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్లు అయిన అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

నేడు గండి క్షేత్రంలో తలనీలాలు బహిరంగ వేలం

ప్రజాశక్తి - చక్రాయపేట

పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులు సమర్పించుకునే తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనువారు రూ.20 లక్షలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చున్నారు. పాట దక్కించుకున్న వారికి 12 నెలలు కాల పరిమితి ఉంటుందన్నారు. ముందుగా టెండర్ బాక్స్ ఓపెన్ చేసి అందులో వచ్చిన టెండర్లలో హెచ్చు మొత్తాన్ని గుర్తించి ఆ మొత్తం నుండి బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ముద్దనూరు

వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైసిపి కార్యాలయ ఆవరణలోని పార్టీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, బాలవీరయ్య, గోపాలకృష్ణ, దస్తగిరి, రమేష్ రెడ్డి, సూర్య మునిరెడ్డి, రామాంజులు రెడ్డి, పుల్లయ్య, రామయ్య పాల్గొన్నారు.

వేంపల్లె : మండలంలో గతం కంటే ఎక్కువ వైసిపికి మెజార్టీ వచ్చేలా ప్రతి కార్యకర్త పని చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్‌వలి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మిగాయిత్రి, హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, రవిశంకర్ గౌడ్, ముత్యాల ఆంజనేయులు, భారతి, చంద్రశేఖర్‌రెడ్డి, కటిక చంద్రశేఖర్, ప్రదీప్‌కుమార్ రెడ్డి, నరసింహ గౌడ్, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, మణిగోపాల్ రెడ్డి, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి జెండా ఎగరవేశారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. మండలంలోని పలువురు వైసిపి నాయకులు వేకువజామునే నిడుజి వ్విలోని ఎమ్మెల్యే ఇంటికెళ్లి స్వయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.